క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి

బత్తలపల్లి: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి సూచించారు. బుధవారం బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామాలు, వీధులు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలక్రిష్టుడు, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంఈఓ ముస్వర్ బాషా, ప్రిన్సిపాళ్లు స్వర్ణలత, సువర్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీటీ ఆస్పత్రి, పాతవూరు, ఎస్టీ కాలనీ, అంబేద్కర్ (ఎస్సీ) కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కోటి కాలనీ, కదిరి రోడ్డు, ధర్మవరం రోడ్డు, తాడిపత్రి రోడ్డు, జగనన్న కాలనీల్లో లైన్లు మరమ్మతు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పెన్నులు, పండ్ల పంపిణీ



పెన్నులు అందజేస్తున్న నాయకులు

గాండ్లపెంట: మల్లమీదపల్లి ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి సమీర్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన 140 మంది విద్యార్థులకు పెన్నులు, పండ్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, లక్ష్మీనరసింహగౌడ్, బావుద్దీన్, అమీర్, శివారెడ్డి, రమణారెడ్డి, హరి, హెచ్‌ఎం హైదర్‌వలి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఫెర్రర్ వర్ధంతి

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 16వ వర్ధంతిని గురువారం బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్ద నిర్వహించనున్నారు. పేదలకు ఇళ్లు, విద్య, వైద్యం అందించి వారి హృదయాల్లో దేవునిగా నిలిచిన ఫాదర్‌ఫెర్రర్ జయంతిని గ్రామాల్లోనూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

పుట్టపర్తి అర్బన్: ఎనుములపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్లు పూర్తయిన చిన్నారులకు ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి ఆధ్వర్యంలో పలకా బలపం ఇచ్చి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీలో నాణ్యమైన విద్యతో పాటు వేడిగా భోజనం, గుడ్డు, పాలు అందిస్తున్నామన్నారు. పిల్లలను బాధ్యతగా, ప్రత్యేక శ్రద్ధతో చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాతమ్మ, కొత్తచెరువు సూపర్‌వైజర్ రజిత, కార్యకర్తలు శైలజ, లక్ష్మి చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలర్ గ్రానైట్‌పై సమీక్ష

అమడగూరు: తుమ్మల గ్రామ పంచాయతీలో సర్వే నంబరు- 1లో కలర్ గ్రానైట్ తవ్వకం కోసం బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ అంశంపై ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ రామనాథరెడ్డి, పర్యవరణ శాఖ ఇంజినీర్, సిబ్బంది, గ్రామ పంచాయతీ సర్పంచ్, ప్రజలు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ కలర్ గ్రానైట్ తవ్వకం కోసం సర్వే నంబరు- 1లో స్థలాన్ని పరిశీలించామని, అయితే ప్రజాభిప్రాయం తీసుకుని ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. దీంతో ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలూ రాకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వాహనాల ఢీ

బత్తలపల్లి: గుమ్మల్లకుంట క్రాస్ సమీపంలో బుధవారం సాయంత్రం కుక్కను తప్పించే క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దినేష్ అనే వ్యక్తి వ్యక్తిగత పనుల నిమిత్తం మరొక వ్యక్తితో కలిసి బుధవారం తిరుపతి నుంచి అనంతపురానికి ఇన్నోవా కారులో బయల్దేరారు. గుమ్మల్లకుంట క్రాస్ వద్దకు రాగానే ఉన్నపళంగా కుక్క దూరడంతో దాన్ని తప్పించే క్రమంలో ముందు టమాటా లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొంది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బొలెరో వాహనం కొద్దిగా అదుపు తప్పినప్పటికీ డ్రైవర్ చాకచక్యంగా నియంత్రణలోకి తెచ్చాడు. దీంతో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు.

పని చేసినా పస్తులే!

- ఉపాధి కూలీలకు తప్పని తిప్పలు
- రెండు నెలలుగా అందని వేతనాలు
- భారమవుతున్న కుటుంబ పోషణ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



బత్తలపల్లి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బత్తలపల్లి: ఉపాధి హామీ కింద పనులు చేసిన కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించకుండా కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 49,292 మంది కూలీలు జాబ్ కార్డు కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం మందికి పైగా ప్రజలు ఉపాధి పనులపై ఆధారపడ్డారు. ఇందులో భాగంగా కుంటలు, వాగులు, చెక్ డ్యాంల్లో పూడిక తీత, చెట్ల తొలగింపు, ఫారంపాండ్ల తవ్వకం తదితర పనుల్లో పాల్గొంటున్నారు. నియోజకవర్గంలోని ధర్మవరం, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో కూలీలకు రూ.2.87 కోట్లకు వేతన (కూలి) రావాల్సి ఉంది. సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో కుటుంబ పోషణకు భారమవుతోంది. దీంతో కూలీలు రోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా డబ్బు ఎప్పుడు పడుతుందో చెప్పే నాథులు కరువయ్యారు.

పథకం నిర్వహణపై నిర్లక్ష్యం

వలసల నివారణ కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణను అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. పథకం కింద పనుల కల్పన.. సౌకర్యాలు.. వేతన చెల్లింపులు తదితర వాటిని పట్టించుకునేవారు లేరు. ఇది వరకు చేసిన పనులకు సంబంధించి స్లిప్‌లు ఇచ్చేవారు. ఎన్ని రోజులు పనిచేశారు.. ఎంత కూలి వస్తుంది అనే వివరాలు అందరికీ తెలిసేవి. ప్రస్తుతం అలాంటి రశీదులు ఇవ్వడం లేదు. తమకు ఎంత వస్తుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని కూలీలు వాపోతున్నారు.

- ఉపాధి పనులు చేసే చోట మధ్యలో విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయాలి. కానీ వీటి జాడ ఎక్కడా కనిపించడంలేదు. ప్రమాదవశాత్తు ఏదైనా గాయాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే అందించాల్సిన వైద్య సేవలకు సంబంధించిన ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి పనులు చేసిన వారికి రెండు వారాల వ్యవధిలోనే వేతనాలు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. వేతనాలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉపాధి రోజువారి వేతనం రూ.307గా నిర్ణయించారు. అయితే ఎక్కడా ఆమేరకు వేతనం ఇస్తున్న దాఖలాలు లేవని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వేతనాలు చెల్లించి, పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతున్నారు.

నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా?



ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందడం లేదు. సకాలంలో డబ్బు అందకపోవడంతో పేదలకు కుటుంబ పోషణ భారంగా మారింది. అనారోగ్యంతో ఉన్నవారు మందులు తెచ్చుకోవడానికి కూడా చేతిలో డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు వారాల్లోపే ఉపాధి వేతనాలు చెల్లించేవారు. కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం త్వరితగతిన వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

– మాదిరెడ్డి జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, బత్తలపల్లి

త్వరలో 'ఉపాధి' వేతనాలు చెల్లిస్తాం



ఉపాధి కూలీలకు మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్ ఉన్నమాట వాస్తవమే. గత ఏప్రిల్ వరకు ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఇక మే, జూన్ నెలలకు సంబంధించిన నిధులు త్వరలోనే విడుదలవుతాయి. ఆ వెంటనే కూలీలకు వేతనాలు చెల్లించేస్తాం. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-కుందానం ఆదెప్ప, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, బత్తలపల్లి

అక్రమ నిర్మాణాలు పూర్తిగా తొలగించేరా?



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న కూలీలు

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువు కూడలిలో గల అక్రమ నిర్మాణాలు పూర్తిగా తొలగిస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. పలువురు తమ పరిధి దాటి స్థలాలను ఆక్రమించి షాపు రూములు నిర్మించారు. అలాంటి షాపులు 128 ఉన్నట్లు గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు.. వాటి తొలగింపు కోసం మార్కింగ్ ఇచ్చారు. తర్వాత ఆక్రమణల తొలగింపునకు పూనుకుంటే సదరు యజమానులు తమకు గడువిస్తే సొంతంగా తొలగించుకుంటామని విన్నవించారు. అయితే పలువురు మార్కింగ్ మేరకు నిర్మాణాలను తొలగిస్తుండగా.. మరికొందరు తమకేమీ పట్టనట్టు మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగిస్తారా.. లేక కొందరు బేఖాతరు చేసి షాపు రూములను కొనసాగాస్తారా అన్నది వేచి చూడాలి.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రాణాప్రతాప్ నాయక్

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి వద్దనున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా రాణాప్రతాప్ నాయక్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్‌బాబు హిందూపురం మండలం చెర్లోపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లగా.. నల్లచెరువు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉన్న రాణాప్రతాప్‌ను జగరాజుపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. బుధవారం రాణాప్రతాప్ నాయక్ బాధ్యతలు చేపట్టారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి మండల అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. రామాపురం, చిల్లవారిపల్లి, నార్శింపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫమీదా పర్వీన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో బోర్లు వేశామని, త్వరలోనే మోటర్లు బిగించి సమస్య పరిష్కరిస్తామని జేఈ తెలిపారు. తాడిమర్రిలో రెండు, చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రం, పెద్దకోట్ల, దాడితోట గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.3 లక్షలతో కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయని చెప్పారు. వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా రూ.75 వేలతో 14 కమ్యూనిటీ సోక్ పిట్లు మంజూరయ్యాయని, సర్పంచులు దగ్గరుండి పనులు చేయించాలని సూచించారు. రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ లేక గ్రామంలో ఏడాది కాలంగా ఉపాధి పనులు పెట్టలేదన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి కోసం వేసిన బోరుకు మోటర్ ఏర్పాటు కోసం ట్రాన్స్‌ఫార్మర్ అందించాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్ర సహాయకుని నియమించడంలో సమస్యలు ఉంటే ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌తో పనులు జరిపించాలని ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డికి సూచించారు. ఏకపాదంపల్లి సర్పంచ్ రామ్మోహన్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారుల తప్పిదాల వల్ల పలువురు మహిళలకు తల్లికి వందనం పథకం డబ్బులు పడలేదని తెలిపారు. దీంతో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల ద్వారా భూములు ఎక్కువగా ఉన్నా తల్లికి వందనం పడేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వైస్ ఎంపీపీ కృష్ణమనాయుడు, కో-ఆప్షన్ సభ్యులు బాబాఫక్రొద్దీన్, ఎంపీడీఓ వెంకట రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ శేఖర్ నాయుడు, ఎంఈఓ కృష్ణమోహన్, ఏపీఎం సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' తప్పులపై వాదులాట

వ్యవసాయ భూమి వివరాల నమోదులో జరిగిన తప్పుల కారణంగా చాలామంది అర్హులకు తల్లికి వందనం డబ్బు జమ కాలేదని టీడీపీ నాయకులు, ఏకపాదంపల్లి, నిడిగల్లు సర్పంచులు కూచి రామ్మోహన్, గోనుగుంట్ల వెంగమనాయుడు (భూషణ) తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా వైఎస్సార్‌సీపీ నాయకులు, పిన్నదరి ఎంపీటీసీ సభ్యులు పూలకుంట చంద్రబాబు, రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య గమనిస్తుండటాన్ని వారు సహించలేకపోయారు. మీరు తమను చూసి నవ్వుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాలూ వాదులాడుకుంటుండటంతో ఎంపీపీ భువనేశ్వర్‌రెడ్డి కల్పించుకుని ఏ ప్రభుత్వంలోనైనా చిన్నచిన్న పొరపాట్లు జరుగుతుంటాయని.. దీనిపై రాద్ధాం చేసుకోవలసిన అవసరం లేదని నచ్చజెప్పి శాంతింపజేశారు.

- వ్యవసాయ భూమి ఎక్కువగా ఉన్నట్లు చూపి తమ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదని బాధితులు ఎం.శ్రీనివాసులు, డీ.లక్ష్మీనారాయణ, సీ.గంగాధర్, సీ.మునిప్రసాద్, సాకే రామచంద్ర తదితరులు ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఉన్న భూమి కన్నా ఎక్కువ చూపారని, దీన్ని సరిచేసి పథకం డబ్బులు పడేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పుట్టపర్తి టౌన్: నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. బుధవారం పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పర్యటించి నాటుసారా తయారీ, విక్రయాల అడ్డుకట్ట వేయాలన్నారు. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. నాటుసాటు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారీ కృషి చేసి 'నవోదయం 2.0'లో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. అనుమతులు ఉన్న మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్లు దుకాణాల్లో కల్తీ జరగకుండా తనిఖీలు చేపట్టాలన్నారు.

సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి

ధర్మవరం రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌లు ఆశాఖ అధికారులకు సూచించారు. బుధవారం ధర్మవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను వారు తనిఖీ చేశారు. సారా కేసులోని నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలన్నారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, సబ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే పథకాలు కట్

- ప్రజాప్రతినిధుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్లే పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన ఎంపీడీఓ నరసింహనాయుడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. అనంతరం హౌసింగ్ ఏఈ విశ్వనాథ్, సీఎస్‌డీటీ రామకృష్ణ, ఏపీఓ ఆదెప్ప, ఏఓ ఓబిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ తదితరులు తమ శాఖల ప్రగతిని వివరించారు. దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు స్పందిస్తూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. రీ-సర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా భూమి ఎక్కువగా చూపుతుండటంతో రైతు కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీలకు 'తల్లికి వందనం', అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని సర్పంచ్‌తో పాటు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధికారులను నిలదీశారు. దంపెట్ల పంచాయతీలోని స్కీం బోర్ల మోటర్ కేబుల్ పలుమార్లు చోరీ అవడంతో పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు చేయలేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గజ్జెల వెంగళరెడ్డి, సాకే పార్వతి, ఈఓఆర్డీ క్రిష్టప్ప, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, మాదిరెడ్డి పద్మావతమ్మ, శారదమ్మ, ప్రభాకర రెడ్డి, బత్తినన్న, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, తప్పెట ఆంజనేయులు, మందల మంజుల, బండి రమణమ్మ, కో ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఏపీఎం హరిప్రసాద్, ఎంఈఓ చాముండేశ్వరి, సెరికల్చర్ అధికారి లక్ష్మన్న, ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఏఎస్‌ఐ విజయ్‌కుమార్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ క్రాంతికుమార్

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటేషన్ అధికారులను కమిషనర్ క్రాంతికుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో శానిటేషన్ అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్నతో పాటు కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి వార్డు సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారని, పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచి.. పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులకు వివరించాలన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం రహిత పట్టణంగా పుట్టపర్తిని తీర్చిదిద్దాలన్నారు. అలాగే తడి చెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాతలు

నల్లచెరువు: కదిరిలో రెడ్డి వేల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణానికి పి.కొత్తపల్లికి చెందిన గోవిందు మహేశ్వర రెడ్డి, గోవిందు చంద్రశేఖర్‌రెడ్డి రూ.8లక్షల విరాళం ప్రకటించారు. అడ్వాన్సుగా రూ.2లక్షల చెక్కును బుధవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, సభ్యులు వై.నారపరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని అనుబంధ విభాగాల నాయకులు పేర్కొన్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆరవవాండ్లపల్లి తండాకు చెందిన డుంగావత్ రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నల్లమాడకు చెందిన ఎస్‌హెచ్ బాషా, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాగానిపల్లికి చెందిన ఉంట్ల లక్ష్మీపతిరెడ్డి, గ్రీవెన్స్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గోపేపల్లికి చెందిన ఎం.జగన్మోహన్‌రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్ సీపీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేస్తామన్నారు. తమను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, ఇందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

జీవితంలో యోగా భాగం కావాలి

పుట్టపర్తి టౌన్: జీవితంలో యోగా ఒక భాగం కావాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ సూచించారు. బుధవారం ఉదయం ఆర్టీసీ డిపో ఆవరణలో అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా శిక్షణ నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ, డీపీటీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం



వృద్ధులకు మందులు అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆకుతోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహక దినోత్సవం సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు స్వచ్ఛంద సంస్థల సమన్వయ కర్త డాక్టర్ సత్య నిర్ధారణ్ తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంస్థ అధినేత సోమల రాజు శివరాజు, వైద్యులు మనోజ్‌కుమార్, నాగరాజు, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులు, బళ్లారి కుంటిమల సత్యనారాయణ, కేతా లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు, సర్వేయర్ల పాత్ర కీలకం



సూచనలు ఇస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం రూరల్: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లదే కీలక పాత్ర అని ఆర్డీఓ మహేష్ అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న ప్రహల్లాదరెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి కనిమిరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రసూనాంబ దపతుల కుమారుడు కనిమిరెడ్డి ప్రహల్లాదరెడ్డి రూ.50 వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో దశరథ నాయుడు, నగేష్, కె.వెంకటరమణారెడ్డి (బాబు), రామాంజనేయులు, ఎం.రామాంజనేయులు, ఎం.ఓబులప్ప, టి.వేమయ్య, జె.లక్ష్మీనారాయణ, ఎస్పీ వెంకటరమణ, ఎస్.కృష్ణమూర్తి, పోలీస్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన చేయండి



యోగాసనాలు వేసిన విద్యార్థులు

ధర్మవరం రూరల్: మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కోసం యోగా సాధన చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మవరం సాయినగర్‌లోని లయోలా పాఠశాలలో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. జిల్లా గౌరవ సలహాదారు అన్నం అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ యోగా చేయడం వల్ల ఏకాగ్రత అలవడి అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శంకర్ నాయుడు, జిల్లా సామాజిక సమరసత వేదిక కన్వీనర్ గడ్డం వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఉచిత యోగా శిక్షణ

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఈ నెల 21 నుంచి యోగాపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శంకర నారాయణ ట్రస్టు చైర్మన్ శంకర్ నారాయణ తెలిపారు. 30వ తేదీ వరకు యోగా గురువు మహేష్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లిలోని వృద్ధాశ్రమంలో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం పూట జ్వరం వస్తున్నా కదిరి ఏరియా ఆస్పత్రిలో గల్ల పరీక్షలు చేయంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త చంద్రమణి, టీబీ హెచ్.పి.పద్మావతి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలి

ధర్మవరం రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టి.. విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్ కుబ్రాకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతు ధర్మవరంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదన్నారు.

రక్తదానం గొప్పది

కదిరి టౌన్: పట్టణంలోని స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం బ్యాంకు 70వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 80 మంది బ్యాంక్ ఉద్యోగులు, యువకులు రక్తదానం చేశారు. అన్నిదానల్లో కెల్లా రక్తదానం గొప్పదని బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, డిప్యూటీ మేనేజర్లు వేంకటేష్ కుమార్, సుజిత,మ్యాష్ మేనేజర్ శ్రీవారిప్రసాద్, బ్యాంక్ వాల్యూయర్ కొమ్ము భాస్కర్, ఈశ్వర్, మేనేజర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.